క్లుప్తంగా

వరి విత్తనాల పంపిణీ

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం, కృష్ణాపురం గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ బుధవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చే యడం ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టెలు ప్రారంభం



పశువులనీటితొట్టెను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీలత, తదితరులు

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రెండు పశువుల నీటి తొట్టె లను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీలత బుధవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ సాయిరామ్ మాట్లాడుతూ పశువుల దాహార్తి తీర్చేందుకు మండలంలోని పలుగ్రామాల్లో రూ.4.50లక్షలతో 12 తొట్టెలను నిర్మించినట్టు తెలిపారు. గ్రామసర్పంచ్ చప్ప శివుడునాయుడు, ఉప సర్పంచ్ మురళి, మాజీ సర్పంచ్ మత్స పాపినాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి



కొండకెంగువలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు

రామభద్రపురం: మూడేళ్ల వయసు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి కోరారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బుధవారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరీ బాలికలు,అంగన్‌వాడీ కేంద్రా ల్లోని ప్రీస్కూల్ పిల్లలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామని, కాన్వెంట్లకు దీటుగా వసతులు కల్పిస్తున్నామన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రేగిడి గ్రామంలోని దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సూరప్పనాయుడు ఆధ్వర్యంలో బుధవారం దత్తజ్ఞాన బోధ సభ నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మనిషిలో ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉన్ననాడే ఉన్నతమైన ఆలోచన లు ఉద్భవిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని వివరించారు. ఆధ్యాత్మిక వక్తలు సామంతుల దామోదరరావు, గొర్లె దామోదరరావు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి తహసీల్దార్‌గా కృష్ణలత



తహసీల్దార్ కృష్ణలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రేగిడి: మండల తహసీల్దార్‌గా ఐ.కృష్ణలత బుధవారం బాధ్యతలు స్వీకరించారధ్యీమె జామి నుంచి బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన ఈశ్వరరావు సర్వే డీటీగా కొనసాగనున్నారు. తహసీల్దార్‌కు వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



వన్నలిలో ప్రచారం చేస్తున్న లక్ష్మీపురం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రేగిడి: మండలంలోని ఏ.వి. పురం, లక్ష్మీపురం, సంకిలి, కాగితాపల్లి, రేగిడి తదితర ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయులు గ్రామాల్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.అయిదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పి డబ్బులు వృథాచేసుకోవద్దని, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పాటు సదుపాయాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు.



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో పాడైన ఆర్వో ప్లాంటు



రామభద్రపురం: మూల సెలగాంలో పాకలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)



రామభద్రపురం: జమ్ము వలస ప్రాథమిక పాఠశాలలో వంటలు చేసేది ఈ షెడ్డులోనే..



బొబ్బిలిరూరల్: అలజంగి ఉన్నత పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణాలు



బొబ్బిలిరూరల్: కేశాయివలస పాఠశాలలో శిథిలమైన మరుగుదొడ్లు

సమస్యల స్వాగతం..

- ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్లు
- తలుపులూడి, శిథిలావస్థలో మరుగుదొడ్లు
- నిలిచిన నాడు–నేడు పనులు



రామభద్రపురం: నేరళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో విరిగిపోయిన తలుపులతో స్నానపుగదులు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. వేసవి సెలవులకు ముందే స్కూళ్లలో సమస్యలను గుర్తించి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి వాటిని పరిష్కరించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది అధికారుల ప్రణాళికా లోపం విద్యార్థులకు శాపంగా మారింది. క్షేత్ర స్థాయిలో పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం మండలంలో 57 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత,ఇతర పాఠశాలలు ఉండగా, వీటిలో 4,893 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే బొబ్బిలి మండలంలో 90 పాఠశాలల్లో 6,419 మంది, తెర్లాం మండలంలో 67 పాఠశాలల్లో 3,550 మంది,బాడంగి మండలంలో 44 పాఠశాలల్లో 2,847 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మన బడి నాడు–నేడు కింద మంజూరైన పాఠశాల ల్లో మినహా మిగిలిన పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. కొన్ని చోట్ల చెట్ల కింద, పాకల్లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరాయి.మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణకు వంటషెడ్లు లేక పోవడంతో నిర్వాహకులు ఆరుబయట వంటలు చేస్తున్నారు. మరుగు దొడ్లు లేకపోవడం, ఉన్న చోట వినియోగానికి వీలుగా లేకపోవడంతో మల, మూత్ర విసర్జనకు విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు–నేడుకు ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యవేక్షణ లోపం, నిర్వహణ సరిగా చేపట్టక పోవడంతో అవి మూలకు చేరాయి.నాడు–నేడు కింద సౌకర్యాలు కల్పించిన పాఠశాలలతో పాటు మిగిలిన పాఠశాలల్లో ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడా విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. పాఠశాలలు తెరిచిన తర్వాత పిల్లలకు కనీసం రక్షిత మంచి నీరు అందే పరిస్థితి కూడా లేదు.పాఠశాలల్లో విద్యుత్ దీపాలు వెలగక పోవడం,ఫ్యాన్లు తిరగకపోవడం, విద్యుత్ వైరింగ్ పరమైన సమస్యలూ ఉన్నాయి. కొన్ని చోట్ల నాడు–నేడులో భాగంగా గత ప్రభుత్వంలో ప్రారంభించిన భవన నిర్మాణాల పనులు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

నేటికీ భవనం లేదు..



చర్చిలో పాఠాలు చెబుతున్న టీచర్ (ఫైల్)

బొబ్బిలిరూరల్: మండలంలోని బట్టివలస గిరిజన గ్రామంలో పాఠశాలకు నేటికీ పక్కా భవనం లేదు. గతంలో పూరి పాకలో పాఠశాల నిర్వహించే వారు. గతేడాది ఈదురు గాలులకు పాక పైకప్పు ఎగిరిపోవడంతో అప్పటి నుంచి సమీపంలోని ఓ చర్చిలో పాఠశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ గతేడాది ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 18 మంది ఉండే వారు. వీరికి ఒక టీచర్ బోధించే వారు. అలాగే గ్రామానికి చెందిన మరో 9మంది విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలోని గోపాలరాయుడు పేట గ్రామ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. సమస్యపై సాక్షిలో ప్రచురితమైన కథనాలకు అధికారులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు స్పందించారు. జిల్లా అధికా రులకు, పాలకులకు సైతం వినతిపత్రాలిచ్చారు. యూటీఎఫ్ ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే బేబీ నాయనకు వి న్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి తాత్కాలిక షెడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఆ హామీ నెరవేరలేదు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..



రాజాం: శిథిలావస్థలో లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల భవనం



రాజాం: సంతకవిటి మండలం మామిడిపల్లి హైస్కూల్‌లో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు

రాజాం: కొత్త విద్యాసంవత్సరం రానే వచ్చింది. వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో పాఠశాలలు సమస్యల వలయం నుంచి బయటపడడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధే తప్ప కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో పాఠశాలలను పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మన బడి నాడు నేడు పథకం కింద పాఠశాలలను విడతల వారీగా అభివృద్ధి చేసింది. నియోజకవర్గంలో ఏటా సగటున రూ.12.50 కోట్లు ఖర్చు చేసి పాఠశాలలకు కొత్త రూపురేఖలు తెచ్చిపెట్టింది. గతేడాది కాలంగా ఈ అభివృద్ధి కనిపించడం లేదు. గతంలో నాడు–నేడులో భాగంగా ప్రారంభించిన భవన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్లలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. రాజాం నియోజకవర్గంలోని రాజాం,రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో 177 ప్రాథమిక, 45 ప్రాథమికోన్నత, 35 ఉన్నత పాఠశాలలు, నాలుగు కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. ఈపాఠశాలల్లో కొన్ని చోట్ల నాడు–నేడు పనులు చేయలేదు. కొన్ని చోట్ల భవనాలు శిథిలావస్థలో, అస్తవ్యస్తంగా ఉన్నాయి. మరుగుదొడ్లు సమస్య కూడా వెంటాడుతోంది. కొత్తగా ఒక్క పాఠశాలలో కూడా మరుగుదొడ్లను నిర్మించలేదు. వంటషెడ్లు లేక వంట నిర్వాహకులు ఆరుబయట వంటలు చేస్తున్నారు. పలు పాఠశాలల్లో కనీసం తాగునీటి సదుపాయం కూడా లేదు. వేసవిలో కాలయాపన చేయడం తప్ప కూటమి ప్రభుత్వం ఒక్కచోట కూడా కొత్తగా భవన నిర్మాణాలు కానీ మరమ్మతులు చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఈప్రభుత్వానికి శ్రద్ధ లేదు..



ప్రభుత్వ పాఠశాలలు బాగు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించడంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టినంత శ్రద్ధ కూటమి ప్రభుత్వం పెట్టడం లేదు.గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేసిందన్నది ఎవరైనా ఒప్పుకోవాల్సిందే. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.ఉపాధ్యాయులు,విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండకూడదు.

కె.విజయగౌరి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు

ప్రతిపాదనలు పంపించాం..



ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులకు, మౌలికవసతుల కల్పనకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలో తగిన చర్యలు తీసుకుంటారు. అలాగే ఆర్వో ప్లాంట్లనుసత్వరం మరమ్మతులు చేయిస్తాం .విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏ విధమైన ఇబ్బంది రానివ్వం.

– ఎ.తిరుమలప్రసాద్, ఎంఈఓ, రామభద్రపురం

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి



బొబ్బిలి: ఆర్డీఓ రామమోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



రామభద్రపురం : డీటీ గిరిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల విలేకరులు



బాడంగి: తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం సమసర్పిస్తున్న విలేకరులు



వంగర: డీటీ హరిరమణారావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బొబ్బిలి: అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగులవలస వ్యాస్ బాబు, సీనియర్ జర్నలిస్టులు కందుల శ్రీనివాసరావు, చుక్క జగన్‌మోహనరావు తదితరులు కోరారు.బుధవారం బొబ్బిలి ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్. రామమోహనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వెంకీ, రమేష్, రాజ్‌కిరణ్, సింహాచలం, పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- బాడంగి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కె.సుధాకర్‌కు మండల విలేకరులు బుధవారం వినతిపత్రం అందజేశారు.ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గొట్టాపు కృష్ణమూర్తి, షేక్ రాజా సాహెబ్, సభ్యులు ఏ.నాగరాజు పి.రామకృష్ణ, ఎస్.అమర్‌నాథ్, బి.లక్ష్మణరావు, బి.మహేష్, జె.సీతారాం పాల్గొన్నారు.
- వంగర: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ హరిరమణారావుకు మండల జర్నలిస్టులు బుధవారం వినతిపత్రం అందజేశారు.డగ్రు రాంబాబు, గంటా నాగేంద్రనాయుడు, మజ్జి గణపతి, నెమలపురి ప్రసాదరావు ఉన్నారు.
- రామభద్రపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ గిరిధర్‌కు మండల విలేకరులు బుధవారం వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం ఫీడర్ పరిధి గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగ నుందని విద్యుత్ శాఖ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు బుధవారం ఓప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ మరమ్మతులు, విద్యుత్ వైర్లను మార్చ డం వంటి పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.ఈనేపథ్యంలో ఎం.ఎస్.ఆర్.పురం, శివ్వాం, తలగాం, రుషింగి, మద్దివలస, కొట్టిశ, లక్ష్మీపేట, కొప్పర, కె.సి.హెచ్. పల్లి, కొప్పరవలస, కె.కొత్తవలస, బంగారువలస, రాజుల గుమ్మడ, చిన్నరాజుల గుమ్మడ, వి.వి.ఆర్.పే ట, జె.కె.గుమ్మడ గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు

రాజాం సిటీ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నా మని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని సబ్‌స్టేషన్‌లో రూ. 50 లక్షలతో ఏర్పాటు చేసిన హెచ్‌టీ లైన్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త లైన్లు వేయడంతో లోవోల్టేజీ సమస్యలతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో అయిదు నూతన సబ్‌స్టేషన్‌లకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ ఫణీంద్రకుమార్, ఆర్డీఓ బి.ఆశయ్య, ఏఈలు ఓజే సీపీ కుమార్, వి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కంచరాం, ఒమ్మి, జీసీహెచ్‌పల్లి, సోపేరు గ్రామాల్లో నూతన సచివాలయ భవనాలను ప్రారంభించారు.

ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన ఆచంట ఐటీఐ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యత లు నిర్వహించిన రమణారావు విశాఖ ఐటీఐలో పూర్తి బాధ్యతలు నిర్వహించనున్నారు.

నీచ రాజకీయాలకు కేరాఫ్ బొబ్బిలి రాజులు



మాట్లాడుతున్న శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కౌన్సిలర్లు

- మానుకుంటే హుందాతనం... లేకుంటే ప్రజాగ్రహం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి

బొబ్బిలి: ప్రజల విశ్వాసంతో వచ్చిన పదవులను ఏమార్చడంలో, నీచ రాజకీయాలు చేయడంలో బొబ్బిలి రాజులకు పెట్టింది పేరని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వయకర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న వ్యక్తే ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నారని, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఇప్పుడు ఓ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నారని, దీనిని బట్టి ఎప్పుడు ఎవరు ఏ పదవిలో ఉంటారో అన్నది ఆ దైవం నిర్ణయిస్తుందన్నారు. అంతే కానీ ప్రజలిచ్చిన పదవులను మనకిష్టం వచ్చిన ట్టు మార్చేస్తే దాని ఫలితం కచ్చితంగా అనుభవించి తీరుతారన్నారు. బొబ్బిలి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రోత్సహించిన వారికి, అందులో భాగస్వామ్యులైన వారికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. గడిచిన ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీని గెలిపించిన వారిలో అన్ని సామాజి క వర్గాలకూ న్యాయం చేయాలన్న తలంపుతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతీ కులానికీ చైర్మన్, కార్పొరేట్ పదవులను అప్పగించారన్నారు. అంతే కాకుండా జెడ్పీ, మున్సిపల్, మండల పరిషత్, స్థానిక ప్రజాప్ర తినిధులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లుగా అణగారిన కులాల వారికి కూడా అవకాశమిచ్చారన్నారు. అలా ఇవ్వడం సరికాదన్న ఉద్దేశంతోనే ఆయా సామాజిక వర్గాలను, వ్యక్తులను కావాల నే టీడీపీ వారు అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని స్థానిక సంస్థలను అవిశ్వాస తీర్మానాల నెపంతో ప్రలోభాల వల విసిరి అడ్డగోలు కొనుగోళ్లు చేసి అధికారాన్ని చేజిక్కించుకుంటు న్నారన్నారు. ఆక్రమణలు, భూకబ్జాలకు తెరలేపు తున్నారని ఈ క్రమంలోనే బొబ్బిలిలోని 11 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు బలయ్యారన్నారు. స్థలాలు, నిధులు, భూములు ఇస్తామనో లేక వారికున్న లోపాలను సరిదిద్దుతామనో అడ్డదారిలోనే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు వల విసిరారని, ఇది సరైన పద్ధతి కాదని తెలుసుకోవాలన్నారు. ఒక పేరు ఉన్న ఫ్యామిలీలో పుట్టిన బొబ్బిలి రాజులు ఇటువంటి నీచరాజకీయాలు మానుకుంటే మంచిదన్నారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

ప్రలోభాలకు లొంగని కౌన్సిలర్లకు కృతజ్ఞతలు

ప్రస్తుతం ప్రలోభాలకు లొంగకుండా, అవిశ్వాసం వైపు కన్నెత్తి చూడకుండా వైఎస్సార్‌సీపీ మనుషులుగా ఉన్న 9 మంది కౌన్సిలర్లకు శంబంగి కృతజ్ఞతలు తెలిపి, మెచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రజలిచ్చిన పదవులను వ్యక్తిగతంగా దుబారా చేసే పరిస్థితులు నెల కొనడం దౌర్భాగ్యమన్నారు. మున్సిపాలిటీలో అందరికీ సమానంగా పదవులిచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. తప్పులు చేయకుండా పరిపాలన సాగిం చిన వారిని అవిశ్వాసంలోకి నెట్టడం దారుణమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి మాట్లాడుతూ 2019 ఎన్నికల నాటికి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ మున్సిపల్ పాలకవర్గం టీడీపీదేనని, అప్పుడు ఇటువంటి నీచ రాజకీయాలు చేయలేదని అన్నారు. వైస్ చైర్మన్‌గా తనపై అవిశ్వాసం పెట్టినంత మాత్రాన సరిపోదని, తన సామాజిక వర్గానికి చెందిన వారికే వైస్ చైర్మన్ పదవినివ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో ఉన్న యాదవ సామాజిక వర్గమంతా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని మట్టికరిపిస్తారని హెచ్చరించారు. కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణ(బాబు),పాలవలస ఉమా శంకరరావు, కోట పెదరాములు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులు విడుదల చేయండి




వ్యవసాయశాఖ ప్రగతిని వివరిస్తున్న ఏడీఏ శ్యామ్ సుందర్

బొబ్బిలిరూరల్: చెరువుల నుంచి పంటపొలాలకు సాగునీరందించే కాలువలను బాగుచేసేందుకు ఉపాధిహామీ నిధులను విడుదల చేయాలని మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశం సాదాసీదాగా సాగింది. వ్యవసాయ శాఖ ఏడీఏ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై అందిస్తున్న వరి విత్తనాల రకాల గురించి, అలాగే నారుమడులు తయారీ, నాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. సాగునీటి కాలువల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం నిధులను విడుదల చేయాలని కృష్ణాపురం సర్పంచ్ సింహాచలం కోరారు.ఇప్పటికే ఉపాధినిధులతో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నామని, త్వరలో చెరువల కింద ఉన్న కాలువల్లో పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మీపతిరాజు తెలిపారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించగా, సభలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.సమావేశంలో వైస్ ఎంపీపీ శంకరరావు, ఎంపీడీఓ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బాడంగి/బొబ్బిలిరూరల్/తెర్లాం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో బాడంగి, బొబ్బిలి, తెర్లాం మండలాల్లో సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు(బేబీనాయన) బుధవారం శంకుస్థాపన చేశారు. బాడంగి మండలంలోని పాల్తేరు గ్రామ సచివాల యం వద్ద, బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద, తెర్లాం మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం, నెమలాం గ్రామాల్లో శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎం.ఆర్ అగ్రహారంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు,బొబ్బిలి ఎంపీపీ శంబంగి లక్ష్మి, తెర్లాం మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మండలాల అధికారులు పాల్గొన్నారు.

ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగ భూషణం డిమాండ్ చేశారు. స్థానిక కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యులతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన వెంటనే ప్రైవేటు,కార్పొరేట్ విద్యా సంస్థలన్నీ ఫీజులు, పుస్తకాల పేరిట దోపిడీ మొదలుపెట్టేశాయని, ప్రభుత్వం కానీ, విద్యాశాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,500.పట్టణ ప్రాంతాల్లో రూ.8,600 వసూలు చేస్తున్నారన్నారు. పదో తరగతి వరకు అయితే ఒక్కో పాఠశాల ఒక్కో విధంగా వేల రూపా యలు వసూలు చేస్తున్నాయని,కార్పొరేట్ సంస్థలైతే ఏకంగా నర్సరీకే రూ.30 నుంచి రూ. 40 వేలు వసూలు చేస్తున్నాయని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోక పోతే త్వరలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గం బి.ప్రవీణ్, వి.శ్రావణ్‌కుమార్, కార్తీక్, రోహిత్, జగదీష్, జాన్, పి.అప్పన్న, రవి, మురళి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.